# అవునా?.. కాదా??

- యం. ఉమామహేశ్వరరావు

నేను చేసినపని గురించి చెప్తే, మీరు నన్ను ఇడియట్ అనో, ఫూల్ అనో, ఇంకా ఇంకా అనేక బిరుదులతో తిడతారు నాకు తెలుసును. నేను నిజంగా ఇడియట్‌నే. ఫూల్‌నే. కాకపోతే నేనెందుకు మీ అందరిచేత ఆ బిరుదులతో పిలుపించుకోదల్చుకున్నానో మీకు తెలీదు.

అవును. నిజంగానే మీకు తెలీదు. మీకు తెలీదన్న విషయం నాకు తెల్సు.

మరణించే మనుషుల గురించి చాలామందికి తెలుస్తుంది. ఆ మనిషి మరణాన్ని చూస్తుంటారు కూడ. కాని జన్మిస్తున్న మనిషిని ఎందరు చూస్తున్నారు?.. ఎందరికి తెలుస్తుంది? నేను బహుశా మరణించి, తిరిగి జన్మించిన వాడినేమో! అందుకే మీకు తెలీదు.. నాగతంలోకి ఇప్పుడే తొంగి చూస్తున్నాను. క్షణం క్షణం నాగురించి నేనే గుర్తుకు తెచ్చుకుంటున్నాను. అందుకు హేట్సాఫ్ టు మై 'నందిని'.

'బాపు' గీసిన బొమ్మలాగ అందంగా, ఖజరహో, ఎల్లోరా శిల్పాకృతులలోని శిల్పకన్యలా ఆకర్షణీయంగా ఉండే 'నందిని'ది మాకోలనీయే. నందిని అందచందాల గురించి ఇంకా వర్ణించాలని వున్నా, నేను 'కవి'ని కాకపోవడంవల్ల ఆ అవకాశం నాకు లేదు. నా కవిత్వం విని ఆనందించే అదృష్టమూ మీకులేదు. దురదృష్టవశాత్తూ 'నందిని' ఓ పేదింటి పేరయ్య కూతురు. అయినా అందగత్తె అని ముందే చెప్పేనుగదా! ఈ విషయంలో నాది 'చైనా'వాళ్ళ పాలసీ...

''నీదగ్గర రెండాకులుంటే ఒకటి నువ్వుంచుకుని, రెండోదాన్ని అమ్మి అందమైన ఓ పువ్వు కొనుక్కో'' అని. నందినిని చూడ్డంకోసం తరచూ స్కూలుకు ఎగ్గొట్టేవాడిని.

''ఒరే.. తిన్నగా రోజూ స్కూలుకు వస్తావా? లేకపోతే పనిష్మెంటివ్వమంటావా?'' స్కూల్లో టీచర్లు చెప్పినా వినలేదు నేను. ఇచ్చుకునేదేదో ఇచ్చుకోమన్నాను.

''నువ్వు స్కూలుకు తిన్నగా రాకపోతే టీ.సీ. ఇచ్చి పంపేస్తాం'' భయపెట్టేరు టీచర్లు. లక్ష్యపెట్టలేదు నేను. నా ఆరాధన ఎంతవరకూ వచ్చిందంటే.. స్కూలుతోపాటుగా కాలేజీ చదువుకు వచ్చేదాకా అది అలా పెరిగిపోతూనే వుంది.

''ఒరే.. నీది నిజమైన ప్రేమకాదు. ఆకర్షణరా.. ఆకర్షణ. అది తొలగిపోతే నీప్రేమా వుండదు, నువ్వూ వుండవు.'' నా ఫ్రెండొకడు గోలపెట్టేడోరోజు.

నేను వినలేదు. నా కళ్ళముందు 'నందిని' రూపం, నాకళ్ళ వెనుక కంటిపాపలో అందమైన నందిని రూపం, మనస్సులోని ప్రతీ 'అర'లోనూ నందిని ప్రేమే నిండివుంది.

''నందిని నీకన్నా వయస్సులో పెద్దదిరా! ఆవిడ మీద నీకు ప్రేమేమిటి? మీ ఇద్దరి కాంబినేషన్ తప్పకుండా ఓ పెద్ద ఫ్లాప్.''

నా ఫ్రెండు బాధగా అరిచేడు నా మొండితనం చూసేక. నవ్వొచ్చింది నాకు. 'చరిత్ర' పుటల్లోకి ఎక్కిన ఎందరో ప్రేమ జంటల్లో.. అతనికన్నా ఆమే పెద్దదైన వాళ్ళు ఎక్కువగానే వున్నారు. వాళ్ళ జీవితాలు చరిత్ర పేజీల్లో సూపర్‌హిట్లు అయ్యేయి.

''వీడికి 'నందిని' పిచ్చి బాగా ముదిరిపోయింది'' అనుకుంటూ మరేవో ప్రయత్నాలు చేయడం మొదలుపెట్టేరు మావాళ్ళు.

• • •

నా ఆరాధనకు ముందు మొదటిసారి ఒకే ఒక్క క్షణంపాటు నందినిని చూసేను. పలకరించేను. ఆమె స్వచ్ఛమైన చిర్నవ్వులోంచి రాలిపడిన ముత్యాలను ఏరి దోసిళ్ళతో పట్టి తిరిగి ఆమెకు సమర్పిద్దామని చూచేటంతలో మాయమైంది. ఆ క్షణిక అనుబంధమే ఎన్ని యుగాలుగానో పెనవేసుకున్న అనుబంధమేమో అన్పించింది. క్షణం అయితేనేం?!

ఆ క్షణానికి ఎంతో విలువుంది.

ఓసారెప్పుడో చదివేను. దేవులపల్లి క్రిష్ణశాస్త్రిగారంటారు. ''ప్రేమించడం అనేది నీరుపారడం, గాలివీచడం అంత సహజం'' అని. ఇంత సహజమైన దాన్ని పట్టుకుని అసహజమని అంటారేం?..

'సహజమైన'దాన్ని 'అసహజమనీ' అసహజాన్ని లాగిలాగి సహజమని గొంతులు చించుకుని అరిచేవాళ్ళు, 'మనిషికీ-మనిషికీ' మధ్యగల ప్రేమనీ, లాలిత్యాన్నీ తన మృదుమధుర కవితల్తో చెప్పిన క్రిష్ణశాస్త్రిని చదవరు. నారీజన సంక్షోభాన్ని వివిధ కోణాల్లో చూపుతూ వ్రాసిన 'చలా'న్నీ చదవరు. అంతేగాదు, మమతత్వంగాని, ప్రాంతీయతత్వంగాని అంటని విశ్వమానవుడు, జిడ్డు క్రిష్ణమూర్తినీ చదవరు. తమకు తోచిందే మంచని గొంతులు చించుకుంటారు.

వీళ్ళంతా బావిలో కప్పలు.. నీళ్ళలో తాబేళ్ళు..

ఆరోజు యింట్లోంచి హఠాత్‌గా బయలుదేరేను. ఆ ముందురోజే కొత్త బట్టలు కొనుక్కోమని 'పిన్ని' ఇచ్చిన మూడు వందల రూపాయలు నాజేబులోనే వున్నాయి.

''రేపు నీ పుట్టినరోజురా! కొత్త బట్టలు కొనుక్కో!!'' అంది పిన్ని. అమ్మతో సమానంగా చూసుకుంటున్న పిన్నితో అబద్ధం చెప్పేను విజయవాడలో ఫ్రెండు పెళ్ళికి వెళ్తున్నానని. కాని, నిజానికి 'నందిని' ఏదో పనిమీద 'విజయవాడ' వెళ్తున్నట్లుగా తెలియడంతో నేనూ బయల్దేరాను. అమ్మయితే ఏం చెప్పినా నమ్మేది, కాని ఆరాతీసేది. పిన్నయితే ఆరాతీయదు. నమ్ముతుంది. చిర్నవ్వుతో నా తలనిమిరింది పిన్ని.

'విజయవాడ' వెళ్ళే ట్రయిన్ ప్లాట్‌ఫామ్మీదుంది. టికెట్ తీసుకుని కదుల్తున్న ట్రయిన్‌లో దొరికిన కంపార్టుమెంటు పట్టుకుని ఎక్కేసేను. ఎక్కేసేక చూసేను, ఆ కంపార్టుమెంటులోనే 'నందిని' వుంది.

• • •



కొందరు ఆదర్శవాదుల జీవితాలు గులాబిపూలుగా పరిమళిస్తాయి. అదిలేని వాళ్ళ బ్రతుకులు గులాబి ముళ్ళుగా వాళ్ళను క్షణం క్షణం గుచ్చుకుంటాయి. ఎన్ని బాధలు అనుభవించయినా ప్రేమకు పట్టం కట్టాలన్నదే నా ఆదర్శం.

ఉరకలు వేస్తోంది క్రిష్ణవేణమ్మ. ఎప్పటికయినా రత్నగిరిని ముద్దుపెట్టుకుని, ఆగిరిపై వెలసిన దుర్గమ్మ ముక్కు మీది ముక్కుపడకని తాకాలని ఉవ్విళ్ళూరుతున్న క్రిష్ణవేణీ తరంగాల సాక్షిగా ఒడ్డునున్న యిసుకలో నందిని ముందు కూర్చున్నాను. స్నేహితురాలింటికని చెప్పి క్రిష్ణాతీరానికి వచ్చింది నందిని. నా మనస్సంతా స్థిరనిశ్చయంతో నిండివుందా సమయంలో. ఎలాగయినా సాధించాలనుకున్నది సాధించిగాని వదలదల్చుకోలేదు. ఒకపనిని సాధించాలనుకున్నప్పుడు దాన్ని సాధించనైనా సాధించాలి- లేదా చావనైనా చావాలి. నా సాహసానికి చావు పెద్ద లెక్కలోనిది కాదని నానమ్మకం.

సుళ్ళు తిరుగుతున్న మనస్సు ఆకులలో పదిలంగా దాచుకున్న ఆలోచనల్ని ఒక్కొక్కటీ పైకి చెప్పేను. ఇసుకలో గూళ్ళు కడుతూ నా మాటల్ని శ్రద్ధగా వింటోంది నందిని. చివరకు నోరు విప్పింది.

''అయితే.. నీ జీవితమంతా తిండీ, నిద్రా మానేసైనా, నాకోసం బ్రతుకుతాను అంటే... నాకు నవ్వొస్తోందిప్పుడు. ఎందుకంటే. నువ్వు నీ సైడునుంచే నన్ను ప్రేమిస్తున్నావు'' అంది నందిని. ''అంతే?'' ఆమె మాటలర్థంగాక తెల్లబోతూ ప్రశ్నించేను.

''ఏముందీ? నామీద ఆకర్షణలోపడి, దానికి ప్రేమనీ- దోమనీ పేర్లు పెట్టుకుని పిచ్చివాడిలా తిరుగుతున్నావు నావెంట! అసలు నీకన్నా నేను వయసులో పెద్దదాన్ని. అందుకే మనిద్దరికీ ఎన్నటికీ కుదరదు.''


'బాంబు'లాంటి మాటను పేల్చింది నందిని.

''నందినీ!'' గట్టిగా అరిచేను, ఆ సాయం సంధ్యలో. నా అరుపుకు నగరం ఉలిక్కిపడినట్లు, పశ్చిమ దిగంతానికి దిగిపోతున్న సూర్యుడు క్షణకాలం ఆగినట్లు, ఒక్కసారిగా క్రిష్ణ తీరంలోని లైట్లన్నీ ఆరిపోయేయి. ఆ నిశీధిలో నందిని ముఖం నాకు కన్పించలేదు. ఆమె స్వరం నుంచి వస్తున్న మాటలు నాగుండెల్ని చీల్చేస్తున్నాయి.

''నీపిచ్చి ప్రేమకు అందరూ నవ్వుతున్నారు. నీ బ్రతుకును వీధిన పడేసుకున్నావు. నన్ను కూడా వీధిలోకి లాగాలని చూస్తున్నావు. దయచేసి పిచ్చి పిచ్చి ఆలోచనలు మానుకో.. బుద్ధిగా చదువుకో!'' అంది నందిని. కొందరి మనసుల్లో ప్రేమ వుంటుంది. కాని, దాన్ని బైటపెట్టలేరు. ఎవరైనా తనను ప్రేమిస్తున్నట్లు చెబితే బెంబేలెత్తిపోతారు. భయంతో ముడుచుకుపోతారు.. ఒకోసారి మొండికేసి తిరగబడతారు.

హఠాత్తుగా లేచింది నందిని.

''ఇక వెళ్ళిపోదామా?'' అంది దుస్తులకంటిన యిసుకను దులుపుకుంటూ. నేనూ లేచేను. ఇద్దరం నడక ప్రారంభించేం. క్రిష్ణానది వంతెన ఎక్కి నడుస్తున్నాం. నందినితో కలిసి నడవాలని, ఆమెతో కలిసి ఒకే గొడుగుక్రింద జీవించాలని ఎన్నెన్నో కలలుకున్నాను. కలిసి నడిచే కోరిక నెరవేరుతోందికాని, కలిసి బ్రతకాలనుకున్నది కుదిరేటట్టులేదు. నందిని నా ప్రేమకు ఫుల్‌స్టాప్ పెట్టేసినట్లే...



ప్రేమంటే ఏదేదో అని తెగ వూహించుకున్నా- కాని, ప్రేమంటే.. 'ఓటమి' అని, ప్రేమంటే.. ఓ 'అవమానం'ని తెలుసుకున్నాను.

ఇద్దరం కలిసి వంతెనమీద చాల దూరం వచ్చేసేం. వంతెనపైగల రెయిల్స్ పట్టుకుని నడుస్తోంది నందిని.

ఎవరో చిత్రకారుడు, ఎన్నాళ్ళో కష్టపడి నాగుండెలపై చిత్రించిన చిత్రాన్ని నందిని ముక్కలు ముక్కలు చేసి పారేసింది. ముక్కలైన ఆ గుండెను పట్టుకుని దేవదాసులా, మజ్నూలా పాటలు పాడటానికి నాకు పాటలు రావు.

క్రిష్ణ నీళ్ళమీద పైనుంచి పడుతున్న నీలినీడలు భయంగొల్పుతున్నాయి. పోయిన లైట్లింకా రాలేదు. ఆకాశంలోని చిన్న చిన్న తారకల కాంతులు నీటి తరంగాలమధ్య మెరుపుల్లా కనిపిస్తున్నాయి. నా గుండె గదులలో తీవ్రమైన అలజడులు ప్రారంభమైనాయి.

'నందిని'పై కోపం పెరిగిపోసాగింది. ఇన్నేళ్ళ నా ఆరాధనని కరివేపాకు రెమ్మలాగ తీసిపారేసింది. జీవితంలో మరిచిపోలేని దెబ్బకొట్టింది. ఇకనుంచి ప్రేమా, దోమా కట్టిపెట్టి బుద్ధిగా చదువుకొమ్మని సలహా ఒకటి ఉచితంగా పారేసింది. తన వయస్సుకు తగినవాడిని ఆనక పెళ్ళిచేసుకుని...

అంతే!!

నాలో ఏదో ఆవహించింది. ఆలోచనలు చిందర వందరగా క్రిష్ణాతరంగాల్లో ఎగిరిపడుతున్నాయి. చీకట్లో నందిని ముఖం వంక చూడాలని ప్రయత్నించేను. ఆమె నవ్వుతోంది. పగలబడి నవ్వుతోంది. విరగబడి మరీ నవ్వుతోంది. ఆ నవ్వు అదోలా వుంది. నడుస్తున్న వాడినల్లా ఠక్కున నందిని చేయి పట్టుకున్నాను.

చివ్వున తలెత్తింది. నావంక చూసింది నందిని.

''ఆ నీళ్ళు ఎలా ఉరకలు వేస్తున్నాయో చూడు నందినీ...'' అన్నాను నీళ్ళలోకి చూపిస్తూ.

ఆ క్షణంలో నందినీ, నేనూ రెయిల్స్‌ను ఆనుకుని బాగా వంగి నీళ్ళలోకి తొంగి చూస్తున్నాం.

''నందినీ!...''

నా స్వరం మారింది. నా స్వరంలోని తీవ్రతకు, మార్పుకు ఉలిక్కిపడి నందిని నావంక చూసేలోగా ఒక్క ఉదుటున నీళ్ళలోకి దూకేసేను. 'కెవ్వు'మన్న నందిని కేక చావబోతున్న నాకెంతో సంతోషాన్నిచ్చింది.

• • •

నందిని భయంతో పరుగెత్తి వుంటుందనీ.. నేను ఈతకొట్టి బయటకు వచ్చేసి వుంటానని మీరూహిస్తున్నారు. అవునా?

కాదు.. కానేకాదు.. మీ ఊహ నిజంకాదు. నాకు ఈత రాదు. ప్రేమలో ఫెయిలై, నిరాశతో బ్రతికేకన్నా, చావడమే మేలనుకున్నాను. చచ్చిపోయి, వచ్చే జన్మలోనైనా నందిని ప్రేమికుడిగా పుట్టాలన్న నా ఆలోచన ఎంత తప్పో ఆలస్యంగా తెలుసుకున్నాను.

తాను నావెనకే 'క్రిష్ణ'లో దూకేసి, ఈదుకుంటూ, ఈత రాక- నీళ్ళల్లో మునిగి చావబోతున్న నన్ను అతి కష్టంమీద బయటకు లాక్కొచ్చి, ఒడ్డున పడేసింది నందిని.

నాకు 'పునర్జన్మ' ప్రసాదించింది నందిని.

'పునర్జన్మ' అంటే మరణించిన వ్యక్తే తిరిగి జన్మిస్తాడని మాత్రమేగాదు, మరణానికి సమీపంలోనికి వెళ్ళి కూడా, అంటే చనిపోయుంటాడని అనుకున్న వ్యక్తి తిరిగి ప్రాణం పుంజుకుని మళ్ళా మామూలు మనిషికావడం కూడా అని నా అభిప్రాయం.

చెప్పడం ఆపి వాళ్ళవంక చూసేను. ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్ళబెట్టి మరీ చూస్తున్నారు వాళ్ళంతా.

''ఒక్క నిముషం! నా భార్యను పిలుస్తానుండండి!!''

''నందినీ! నందినీ!!'' నందిని బయటకు రానేవచ్చింది.

జీవితంలో సాహసం అనేది ఓ విశిష్టమైన లక్షణం. అసలు ఈగుణం మగవాళ్ళలోకన్నా, ఆడవాళ్ళలోనే ఎక్కువుగా వుంటుందని, వాళ్ళే ఎక్కువగా సాహసించగలరని అంటుంది 'నందిని'.

అవునా?.. కాదా??

★